24-02-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు ఇప్పుడు హంసలుగా అయ్యే పురుషార్థం చేస్తున్నారు, మీరు ఈ లక్ష్మీ-నారాయణుల వలె హంసలుగా అనగా సంపూర్ణ నిర్వికారులుగా అవ్వాలి"

ప్రశ్న:- ఈ జ్ఞాన మార్గములో తీవ్రంగా ముందుకు వెళ్ళేందుకు సహజమైన విధి ఏమిటి?

జవాబు:- ఈ జ్ఞానములో తీవ్రంగా (చురుకుగా) ముందుకు వెళ్ళాలంటే మిగిలిన ఆలోచనలన్నింటినీ వదిలి తండ్రి స్మృతిలో నిమగ్నమవ్వండి, తద్వారా వికర్మలు వినాశనమవుతాయి మరియు మొత్తం చెత్త అంతా తొలగిపోతుంది. స్మృతి యాత్రయే ఉన్నత పదవికి ఆధారము, దీని ద్వారానే మీరు గవ్వ నుండి వజ్రముగా అవ్వగలుగుతారు. తండ్రి డ్యూటీ - మిమ్మల్ని గవ్వ నుండి వజ్రముగా, పతితము నుండి పావనముగా తయారుచేయడము. అలా చేయకుండా తండ్రి కూడా ఉండలేరు.

ఓం శాంతి. తండ్రి కూర్చొని పిల్లలకు ఏమని అర్థం చేయిస్తున్నారంటే, ఈ ప్రపంచములో కొందరు హంసలుగా ఉన్నారు, కొందరు కొంగలుగా ఉన్నారు. ఈ లక్ష్మీ-నారాయణులు హంసలు, వీరిలా మీరు తయారవ్వాలి. మీరు అంటారు - మేము దైవీ సాంప్రదాయులుగా అవుతున్నాము అని. తండ్రి అంటారు, మీరు దైవీ సాంప్రదాయులుగా అవుతున్నారు, నేను మిమ్మల్ని హంసలుగా తయారుచేస్తాను, ఇప్పుడింకా పూర్తిగా తయారవ్వలేదు, తయారవ్వాలి. హంసలు ముత్యాలను ఏరుతాయి, కొంగలు అశుద్ధమైనవి తింటాయి. ఇప్పుడు మనం హంసలుగా అవుతున్నాము. అందుకే దేవతలను పుష్పాలు అని అనడం జరుగుతుంది మరియు ఇతరులను ముళ్ళు అని అనడం జరుగుతుంది. హంసలుగా ఉండేవారు, తర్వాత కిందకు దిగుతూ కొంగలుగా అయిపోయారు. అర్ధకల్పము హంసలు, అర్ధకల్పము కొంగలు. హంసలుగా అవ్వడంలో కూడా మాయ విఘ్నాలు ఎన్నో కలుగుతాయి. ఏదో ఒక రకంగా పడిపోవడం జరుగుతుంది. ముఖ్యంగా దేహాభిమానం వలన పడిపోవడం జరుగుతుంది. ఈ సంగమములోనే పిల్లలైన మీరు పరివర్తన అవ్వాలి. మీరెప్పుడైతే హంసలుగా అవుతారో అప్పుడిక హంసలే హంసలు ఉంటారు. హంసలు అనగా దేవీ-దేవతలు కొత్త ప్రపంచములో ఉంటారు. పాత ప్రపంచములో హంసలు ఒక్కరు కూడా ఉండరు. సన్యాసులు ఉన్నా కానీ వారు హద్దు సన్యాసులు. మీరు అనంతమైన సన్యాసులు. బాబా అనంతమైన సన్యాసాన్ని నేర్పించారు. ఈ దేవతల వలె సర్వగుణ సంపన్నులుగా ఇంకే ధర్మమువారు అసలు అవ్వనే అవ్వరు. ఇప్పుడు తండ్రి కూడా ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేయడానికి వచ్చారు. మీరే కొత్త ప్రపంచములో మొట్టమొదట సుఖములోకి వస్తారు, ఇంకెవ్వరైనా కొత్త ప్రపంచంలోకి వస్తారా. ఇప్పుడు ఈ దేవతల ధర్మమే కనుమరుగైపోయింది. ఈ విషయాలను కూడా మీరు ఇప్పుడే వింటున్నారు మరియు అర్థం చేసుకుంటారు. ఇంకెవ్వరూ అర్థం చేసుకోలేరు. అవన్నీ మనుష్య మతాలు, వికారాల ద్వారానే అందరూ జన్మ తీసుకున్నారు కదా. సత్యయుగములో వికారాల విషయమేమీ ఉండదు. దేవతలు పవిత్రముగా ఉండేవారు. అక్కడ యోగబలము ద్వారానే అంతా జరుగుతుంది. అక్కడ పిల్లలు ఎలా జన్మిస్తారు అనేది ఇక్కడి పతిత మనుష్యులకు ఏం తెలుసు? దాని పేరే నిర్వికారీ ప్రపంచము. వికారాల విషయమే ఉండదు. జంతువులు మొదలైనవి ఎలా జన్మిస్తాయి అని అంటారు. వారికి చెప్పండి, అక్కడ ఉన్నది యోగబలము, వికారాల విషయమే ఉండదు. 100 శాతము నిర్వికారులుగా ఉంటారు. మేమైతే శుభం పలుకుతున్నాము. మీరు అశుభం ఎందుకు మాట్లాడుతున్నారు? దీని పేరే వేశ్యాలయము మరియు దాని పేరే శివాలయము. ఆ శివాలయ స్థాపనను శివబాబా చేస్తున్నారు. శివబాబా ఉన్నతోన్నతమైన టవర్ కదా. శివాలయాలను కూడా ఈ విధంగా పొడవుగా తయారుచేస్తారు. శివబాబా మిమ్మల్ని సుఖము యొక్క టవర్ గా తయారుచేస్తారు, సుఖము యొక్క టవర్ పైకి తీసుకువెళ్తారు, అందుకే బాబాపై ఎంతో ప్రేమ ఉంటుంది. భక్తి మార్గములో కూడా శివబాబాపై ప్రేమ ఉంటుంది. శివబాబా మందిరంలోకి ఎంతో ప్రేమగా వెళ్తారు, కానీ ఏమీ అర్థం కాదు. ఇప్పుడు పిల్లలైన మీరు సర్వగుణ సంపన్నులుగా అవుతున్నారు. ఇప్పుడింకా సంపూర్ణులుగా అవ్వలేదు. ఎప్పుడైతే మీ రాజధాని పూర్తిగా స్థాపన అవుతుందో, అప్పుడు మీ పరీక్ష ఉంటుంది. అప్పుడిక మిగిలినవారంతా అంతమైపోతారు, ఆ తర్వాత నంబరువారుగా కొద్ది-కొద్దిగా వస్తూ ఉంటారు. మీదైతే మొదటి నుండే రాజ్యం ప్రారంభమవుతుంది. ఇతర ధర్మాలలో మొదటే రాజ్యం ప్రారంభమవ్వదు. మీదైతే ఉండేదే రాజ్యము. ఈ విషయాల గురించి పిల్లలైన మీకే తెలుసు. బెనారస్ లో పిల్లలు సేవ చేయడానికి వెళ్ళారు, వారికి ఇతరులకు అర్థం చేయించే నషా ఉంది. కానీ వాళ్ళు అంతగా అర్థం చేసుకోలేకపోయారు. కోట్లలో కొందరు అని అంటూ ఉంటారు కూడా. హంసలుగా ఎవరో అరుదుగా తయారవుతారు. అలా తయారవ్వకపోతే ఇక ఎన్నో శిక్షలను అనుభవిస్తారు. కొందరైతే 95 శాతం శిక్షలు పొందుతారు, కేవలం 5 శాతం మారుతారు. హైయ్యెస్ట్ (ఉన్నతోన్నతమైన)

మరియు లోయెస్ట్ (అత్యంత కనిష్టమైన) నంబరులైతే ఉంటాయి కదా. ఇప్పుడు ఎవ్వరూ స్వయాన్ని హంసలుగా పిలుచుకోలేరు. పురుషార్థం చేస్తున్నారు. ఎప్పుడైతే జ్ఞానం పూర్తయిపోతుందో అప్పుడు యుద్ధం కూడా మొదలవుతుంది. జ్ఞానాన్ని అయితే పూర్తిగా తీసుకోవాలి కదా. ఆ యుద్ధమే ఫైనల్ అవుతుంది. ఇప్పుడైతే ఎవ్వరూ 100 శాతము తయారవ్వలేదు. ఇప్పుడింకా ఇంటింటికీ సందేశాన్ని అందించాలి. చాలా భారీ రెవెల్యూషన్ (విప్లవం) జరుగుతుంది. ఎవరిపైతే పెద్ద-పెద్ద సింహాసనాలు తయారై ఉన్నాయో, అవన్నీ కదలడం మొదలవుతాయి. భక్తి యొక్క సింహాసనము కదలడం మొదలవుతుంది. ఇప్పుడు ఇది భక్తుల రాజ్యము కదా. దానిపై మీరు విజయం పొందుతారు. ఇప్పుడిది ప్రజలపై ప్రజల రాజ్యము, తర్వాత పరివర్తన జరుగుతుంది. ఈ లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఏర్పడుతుంది. మీరు సాక్షాత్కారాలు పొందుతూ ఉంటారు. రాజధాని ఎలా నడుస్తుంది అన్న విషయములో ప్రారంభంలో మీకు ఎన్నో సాక్షాత్కారాలు చేయించడం జరిగింది. కానీ సాక్షాత్కారాలు పొందినవారు ఈ రోజు లేరు. ఇది కూడా డ్రామా, ఎవరికి ఏ పాత్ర ఉంటుందో అది నడుస్తూ ఉంటుంది. ఇందులో మనం ఎవరి మహిమనూ చేయము. తండ్రి కూడా అంటారు, మీరు నన్ను మహిమ చేసేదేముంది? పతితులను పావనంగా తయారుచేయడమనేది నా డ్యూటీ. టీచర్ డ్యూటీ చదివించడము. తమ డ్యూటీని నిర్వర్తించేవారిని మహిమ చేసేదేముంటుంది? బాబా అంటారు, నేను కూడా డ్రామాకు వశమై ఉన్నాను, ఇందులో ఇక శక్తి యొక్క మాటేముంది. ఇది నా డ్యూటీ. కల్ప-కల్పము సంగమములో వచ్చి పతితుల నుండి పావనులుగా తయారుచేసే మార్గాన్ని తెలియజేస్తాను. నేను పావనంగా తయారుచేయకుండా ఉండలేను. నా పాత్ర ఏక్యురేట్ గా ఉంటుంది. ఒక్క క్షణం కూడా ఆలస్యంగా లేక ముందుగా రాలేను. పూర్తిగా ఏక్యురేట్ సమయములో సేవా పాత్రను అభినయిస్తాను. క్షణ-క్షణము ఏదైతే గడుస్తుందో, అది డ్రామా నా చేత చేయిస్తుంది. నేను పరవశమై ఉన్నాను, ఇందులో మహిమ యొక్క విషయమేమీ లేదు. నేను కల్ప-కల్పము వస్తాను, నన్ను పిలవడమే పతితము నుండి పావనంగా తయారుచేసేవారా రండి, అని పిలుస్తారు. ఎంత పతితముగా అయిపోయారు. ఒక్కొక్క అవగుణాన్ని వదిలింపజేయడానికి ఎంత శ్రమించాల్సి వస్తుంది. చాలాకాలం పవిత్రముగా ఉండి కూడా మళ్ళీ నడుస్తూ-నడుస్తూ మాయ చెంపదెబ్బ తగలడంతో నల్ల ముఖం చేసుకుంటారు.

ఇది ఉన్నదే తమోప్రధాన ప్రపంచము. మాయా శత్రువు ఎంతగానో ఎదిరిస్తుంది. సన్యాసులు కూడా జన్మనైతే వికారాల ద్వారానే తీసుకుంటారు. ఎవరి జ్యోతి, జ్యోతిలో కలిసిపోదు, తిరిగి వెళ్ళలేరు. ఆత్మ అవినాశీ మరియు ఆత్మ పాత్ర కూడా అవినాశీ, మరి జ్యోతి జ్యోతిలో ఎలా కలిసిపోగలదు. మనుష్యులు ఎంతమంది ఉన్నారో, విషయాలు అన్ని ఉన్నాయి. అవన్నీ మనుష్య మతాలు. ఈశ్వరీయ మతమైతే ఒక్కటే. దేవతా మతము ఇక్కడ ఉండదు. దేవతలు సత్యయుగములో ఉంటారు. ఇవి బాగా అర్థం చేసుకోవలసిన విషయాలు. మనుష్యులకైతే ఏమీ తెలియదు, అందుకే దయ చూపించమని ఈశ్వరుడిని పిలుస్తారు. తండ్రి అంటారు, నేను మిమ్మల్ని ఎటువంటి యోగ్యులుగా తయారుచేస్తానంటే తద్వారా మీరు పూజకు యోగ్యులుగా అవుతారు. ఇప్పుడేమైనా పూజకు యోగ్యులుగా ఉన్నారా, అలా తయారవుతూ ఉన్నారు. మీకు తెలుసు - మేమే ఈ విధంగా తయారవుతాము, తర్వాత భక్తి మార్గములో మాకే మహిమ జరుగుతుంది, మా మందిరాలే తయారవుతాయి. చండికాదేవి మేళా కూడా జరుగుతుందని మీకు తెలుసు. చండీ, అనగా తండ్రి శ్రీమతంపై నడవనివారు. అయినా కానీ విశ్వాన్ని పవిత్రంగా తయారుచేయడంలో ఎంతో కొంత సహాయమైతే చేస్తారు కదా. ఇది సైన్యం కదా. శిక్షలు మొదలైనవి అనుభవించినా కూడా, తర్వాత విశ్వానికి యజమానులుగా అయితే అవుతారు కదా. ఇక్కడ ఎవరైనా ఆటవికులు ఉన్నా, వారు కూడా, మేము భారత్ కు యజమానులము అని అంటారు. ఈ రోజుల్లో చూడండి, ఒకవైపేమో, మా భారత్ అన్నింటికన్నా ఉన్నతమైన దేశము అని పాడుతారు మరియు ఇంకొకవైపు భారత్ పరిస్థితి ఎలా అయిపోయింది అని అంటారు. రక్తపు నదులు ప్రవహిస్తూ ఉంటాయి. ఒక పాటలో మహిమ ఉంటే, ఇంకొక పాటలో నింద. ఏమీ అర్థం చేసుకోరు. మీకైతే యథార్థ రీతిగా ఇప్పుడు తండ్రి అర్థం చేయిస్తారు. వీరిని భగవంతుడు చదివిస్తున్నారు అని మనుష్యులకు తెలుసా. వాహ్, వీరు భగవంతుడినే టీచరుగా చేసుకున్నారు! అని అంటారు. అరే, భగవానువాచ ఉంది కదా, నేను మిమ్మల్ని రాజులకే రాజులుగా చేస్తాను అని. కేవలం గీతలో మనిషి పేరును వ్రాసి గీతను ఖండితం చేసేసారు. శ్రీకృష్ణ భగవానువాచ అంటే, ఇదైతే మనుష్య మతం అయినట్లు కదా. శ్రీకృష్ణుడు ఇక్కడికి ఎలా వస్తారు? అతను సత్యయుగ రాకుమారునిగా ఉండేవారు. అతనికి ఈ పతిత ప్రపంచములోకి రావలసిన అవసరం ఏముంది.

తండ్రి గురించైతే పిల్లలైన మీకే తెలుసు కానీ మీలో కూడా ఎవరో అరుదుగా యథార్థ రీతిగా తెలుసుకుంటారు. పిల్లలైన మీ నోటి నుండి ఎల్లప్పుడూ రత్నాలే వెలువడాలి, రాళ్ళు కాదు. మరి నేను ఆ విధంగా తయారయ్యానా అని స్వయాన్ని ప్రశ్నించుకోవాలి. మేము చెత్త నుండి త్వరగా బయటకు రావాలి అని కోరుకుంటారు కూడా, కానీ త్వరగా

రాలేకపోతారు. సమయం పడుతుంది, మీరు ఎంతగానో కష్టపడవలసి ఉంటుంది. అర్థం చేయించేవారిలో కూడా నంబరువారుగా ఉన్నారు, యుక్తియుక్తంగా అర్థం చేయించడమనేది చివరిలో జరుగుతుంది, అప్పుడు మీ బాణాలు తగులుతాయి. ఇప్పుడు మన చదువు నడుస్తోందని మీకు తెలుసు. చదివించేవారైతే ఒక్కరే. అందరూ వారి ద్వారా చదువుకునేవారే. ముస్ముందు మీరు ఎటువంటి యుద్ధాన్ని చూస్తారంటే ఇక అడగకండి. యుద్ధంలోనైతే ఎంతోమంది మరణిస్తారు, మరి ఇంతమంది ఆత్మలు ఎక్కడకు వెళ్తారు. అందరూ కలిసి వెళ్ళి ఒకసారే జన్మ తీసుకుంటారా? వృక్షం పెద్దది అవుతుంది, ఎన్నో శాఖోపశాఖలు, ఆకులు ఏర్పడతాయి. రోజు ఎంతమంది జన్మిస్తారు, మరణించడం కూడా ఎంతమంది మరణిస్తారు. తిరిగి అయితే ఎవ్వరూ వెళ్ళలేరు. మనుష్యుల వృద్ధి జరుగుతూ ఉంటుంది. అయితే ఈ విస్తారమైన విషయాలలోకి వెళ్ళడంకన్నా ముందు తండ్రిని స్మృతి చేసినట్లయితే తద్వారా వికర్మలు వినాశనమవుతాయి మరియు చెత్త తొలగిపోతుంది. ఆ తర్వాత వేరే విషయాలు. మీరు దీని గురించి ఏమీ ఆలోచించకండి. మొదట మీరు ఆ విధంగా తయారయ్యేటువంటి పురుషార్థము చేయండి. ముఖ్యమైనది స్మృతి యాత్ర మరియు అందరికీ సందేశాన్ని ఇవ్వాలి. సందేశకుడు ఒక్కరే. ధర్మ స్థాపకులను కూడా సందేశకులు లేదా గురువులు అని అనలేరు. సద్గతిదాత సద్గురువు ఒక్కరే. ఇకపోతే, భక్తి మార్గంలో మనుష్యులు ఎంతో కొంత బాగుపడతారు. ఏదో ఒక దానం కూడా చేస్తారు. తీర్థయాత్రలకు వెళ్తే ఏదో ఒకటి దానమిచ్చి వస్తారు. ఈ అంతిమ జన్మలో తండ్రి మనల్ని వజ్రతుల్యంగా తయారుచేస్తున్నారు అనైతే మీకు తెలుసు. దీనినే అమూల్యమైన జీవితం అని అంటారు, కానీ అంతటి పురుషార్థము చేయవలసి ఉంటుంది. మా దోషమేమీ లేదు అని మీరు అంటారు. అరే, నేను పుష్పాలుగా తయారుచేయడానికి వచ్చాను, మరి మీరు ఎందుకు తయారవ్వటం లేదు. నా డ్యూటీ అయితే పావనంగా తయారుచేయడము. మరి మీరు ఎందుకు పురుషార్థం చేయరు? పురుషార్థం చేయించే తండ్రి అయితే లభించారు. ఈ లక్ష్మీ-నారాయణులను ఈ విధంగా ఎవరు తయారుచేసారు? ప్రపంచానికి ఏమైనా తెలుసా. తండ్రి సంగమములోనే వస్తారు. ఇప్పుడు మీ విషయాలను ఎవ్వరూ అర్థం చేసుకోరు, ముస్ముందు ఎప్పుడైతే మీ వద్దకు ఎంతోమంది వస్తారో, అప్పుడు వారి గిరాకీ పడిపోతుంది. తండ్రి అంటారు, ఈ వేద-శాస్త్రాల సారాన్ని నేను వినిపిస్తాను. లెక్కలేనంతమంది గురువులు ఉన్నారు, అందరూ భక్తి మార్గానికి చెందినవారు. సత్యయుగంలో అందరూ పావనముగా ఉండేవారు, తర్వాత పతితముగా అయ్యారు. ఇప్పుడు తండ్రి మళ్ళీ వచ్చి మీ చేత అనంతమైన సన్యాసాన్ని చేయిస్తారు ఎందుకంటే ఈ పాత ప్రపంచము అంతమవ్వనున్నది, అందుకే తండ్రి అంటున్నారు - స్మశానం నుండి బుద్ధిని తొలగించి తండ్రినైన నన్ను స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి. ఇప్పుడు ఇది వినాశన సమయము. అందరి లెక్కాచారాలు సమాప్తమవ్వనున్నాయి. మొత్తం ప్రపంచములోని ఆత్మలెవరైతే ఉన్నారో వారిలో పాత్ర అంతా నిండి ఉంది. ఆత్మ శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయిస్తుంది. కావున ఆత్మ కూడా అవినాశీ, పాత్ర కూడా అవినాశీ. ఇందులో ఏ తేడా ఏర్పడదు. యథావిధిగా రిపీట్ అవుతూనే ఉంటుంది. ఇది చాలా పెద్ద అనంతమైన డ్రామా. నంబరువారుగా అయితే ఉండనే ఉంటారు. కొందరు ఆత్మిక సేవను చేసేవారు ఉన్నారు, కొందరు స్థూల సేవను చేసేవారు ఉన్నారు. కొందరు అంటారు, బాబా, మేము మీకు డ్రైవర్ గా అవుతాము, అప్పుడు అక్కడ కూడా విమానానికి యజమానులుగా అయిపోతాము అని. ఈ రోజుల్లోని గొప్ప వ్యక్తులు - ఇప్పుడైతే మా కొరకు ఇదే స్వర్గము, పెద్ద-పెద్ద మహళ్ళు, విమానాలు ఉన్నాయి అని భావిస్తారు. తండ్రి అంటారు, ఇవన్నీ కృత్రిమమైనవి, వీటిని మాయ యొక్క ఆడంబరము అని అంటారు. ఏమేమో నేర్చుకుంటూ ఉంటారు. ఓడలు మొదలైనవాటిని తయారుచేస్తారు. ఇప్పుడు ఈ ఓడలు మొదలైనవి అక్కడ ఏమైనా ఉపయోగపడతాయా. బాంబులను తయారుచేస్తారు, ఇవేమైనా అక్కడ ఉపయోగపడతాయా. సుఖమునిచ్చే వస్తువులైతే ఉపయోగపడతాయి. వినాశనం జరగడానికి సైన్స్ సహాయం చేస్తుంది. మళ్ళీ అదే సైన్స్ మీకు కొత్త ప్రపంచాన్ని తయారుచేయడంలో కూడా సహాయం చేస్తుంది. ఈ డ్రామా చాలా అద్భుతంగా తయారుచేయబడి ఉంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఈ వినాశన సమయంలో పాత ప్రపంచం నుండి అనంతమైన సన్యాసము చేయాలి. ఈ స్మశానం నుండి బుద్ధిని తొలగించి వేయాలి. స్మృతిలో ఉంటూ పాత లెక్కాచారాలన్నింటినీ సమాప్తం చేసుకోవాలి.

2. నోటి నుండి సదా జ్ఞాన రత్నాలే వెలువడాలి, రాళ్ళు కాదు. పూర్తి-పూర్తిగా హంసలుగా అవ్వాలి. ముళ్ళను

పుష్పాలుగా తయారుచేసే సేవను చేయాలి.

వరదానము:- సేవతోపాటుగా అనంతమైన వైరాగ్య వృత్తి యొక్క సాధనను ఇమర్జ్ చేసే సఫలతామూర్త భవ

సేవ ద్వారా సంతోషం మరియు శక్తి లభిస్తుంది కానీ సేవలోనే వైరాగ్య వృత్తి కూడా సమాప్తమైపోతుంది, అందుకే మీ లోపల వైరాగ్య వృత్తిని మేల్కొలపండి. ఏ విధంగా సేవా ప్లాన్లను ప్రాక్టికల్ లో ఇమర్జ్ చేసినప్పుడు సఫలత లభిస్తుందో, అదే విధంగా ఇప్పుడు అనంతమైన వైరాగ్య వృత్తిని ఇమర్జ్ చేయండి. ఎన్ని సాధనాలు ప్రాప్తించినా కానీ అనంతమైన వైరాగ్య వృత్తి యొక్క సాధన మర్జ్ అవ్వకూడదు. సాధన మరియు సాధనాల యొక్క బ్యాలెన్స్ ఉండాలి, అప్పుడే సఫలతామూర్తులుగా అవుతారు.

స్లోగన్:- అసంభవాన్ని సంభవం చేయడమే పరమాత్మ ప్రేమకు గుర్తు.